# గొంగళి పురుగు

ఎమ్మెశ్రీనిజ్

"మనం వెళ్ళేది ఇంటికే కదండీ?" అడిగింది సునంద.

"అవునూ, ఇంటికే" అన్నాడు సుధీర్.

"మరి స్కూటర్‌ను ఇటువైపు పోనిస్తున్నారూ?"

"ఇటువైపు నుంచి కూడా వెళ్ళొచ్చు."

"చాలా దూరం అవుతుంది కదండీ?"

"కానీ" అంటూ స్కూటర్ ఏక్సిలేటర్‌ను రెయిజ్ చేశాడు సుధీర్. హైదరాబాదు మహానగరంలో ముషీరాబాద్ మెయిన్ రోడ్డు దిగి చిన్న చిన్న వీధులగుండా స్కూటర్ చాలా స్పీడుగా వెళుతోంది. సుధీర్ మాటి మాటికి హారన్‌ను మోగిస్తున్నాడు. వీధిలో ఎవరూ అడ్డు లేకపోయినా సుధీర్ అదేపనిగా హారన్ను మోగిస్తుంథడం వల్ల సునందకు చిర్రెత్తింది.



సుధీర్ స్కూటర్ని అటువైపు నుంచి తీసుకెళ్ళడం, అకారణంగా స్పీడును పెంచడం, తగ్గించడం, హారన్‌ను నిర్విరామంగా మోగించడం పట్ల సునందకు ఏదో సందేహం కలిగింది. అయినా ఏమీ మాట్లాడలేదు.

సుధీర్, సునందల వివాహమై మూడు మాసాలైంది. హైదరాబాదులో సెంట్రల్ గవర్నమెంటుకు సంబంధించిన ఆఫీసులో సుధీర్ గత రెండేళ్ళ నుంచి ఉద్యోగం చేస్తున్నాడు. సునందను కాపురానికి తీసుకొచ్చి ఇంకా నెల రోజులు కూడా పూర్తి కాలేదు. కాపురాని కొచ్చిన తొలి రోజు నుంచి షాపింగ్ పేరుతో, సిటీ విజిటింగ్ పేరుతో, సినిమా పేరుతో సునందను స్కూటర్‌పైన కూర్చోబెట్టుకుని ప్రతి రోజూ తిరుగుతూనే ఉన్నాడు సుధీర్. కానీ ఈ రోజు స్కూటర్ నడిపే విధానంలో మార్పు గమనించింది సునంద.

సికింద్రాబాద్‌లోని పార్శీ గుట్ట దగ్గరున్న బంధువులను పలకరించడానికి వచ్చిన ఆ జంట, ఇంటికి చేరడానికి అరగంట కూడా పట్టదు. కానీ ఈ రోజు మాత్రం అనుకోని వీథుల గుండా స్కూటర్ని పోనిస్తూ గంటన్నర తరువాత ఇల్లు చేరుకున్నారు.

** ** **

రోజులు గడుస్తున్నాయి.

బయటికి వెళ్ళే అవసరం లేకపోయినా - ట్రైం పాస్ పేరుతో ప్రతి రోజూ సాయంకాలం పూట సునందను స్కూటర్‌పైన కూర్చోబెట్టుకుని - తను అనుకున్న వీథుల గుండా స్కూటర్ని నడపడం అలవాటు చేసుకున్నాడు సుధీర్.

ఠంచన్‌గా అనుకున్న సమయానికి తనకు కావాల్సిన ఇంటిని సమీపించడం - అవసరం లేకపోయినా హారన్ మోగించడం, తనకు కావాల్సిన యువతులు వీధి గుమ్మంలోకి రావడం [అడ్డాన్నుగా అరుగుల మీద కూర్చుని ఉండడం], అసూయగా తమ జంటవైపు చూడ్డం సుధీర్‌కు ఆనందం కలగడం పరిపాటైపోయింది.

సుధీర్‌కు పెళ్ళిచూపులంటే పడదు. బాహ్య సౌందర్యాన్ని చూసి భార్యను ఎన్నుకొనేంత మూర్ఖమైన పని ఇంకొకటి ఉండదని అతని విశ్వాసం. అందుకే అతని తల్లితండ్రులు పెళ్ళి ప్రయత్నాలు కొనసాగిస్తుంటే - "అమ్మాయిన్ని చూసే అవసరం ఏమీలేదు. కాపురం చేసేది నేనే అయినా మీకు నచ్చితే సరి" అన్నాడు.

"అమ్మాయి నీకు నచ్చినా నచ్చకపోయినా అమ్మాయి క్కూడా నువ్వు నచ్చాలి కదా? లేకపోతే పెళ్ళి జరిగిపోయాక భర్త నచ్చలేదని అమ్మాయి చిన్నబుచ్చుకుంటే నీ జీవితం నరకంపాలే అవుతుంది" అన్నారు తల్లిదండ్రులు.

వాళ్ళ మాటల్లో కూడా నిజమే ఉందని గ్రహించిన సుధీర్ ఒకసారి పెళ్ళిచూపులకు నామమాత్రానికి హాజరు అయ్యాడు. కానీ సుధీర్ ఊహించని పరిణామం ఎదురైంది. అమ్మాయి- సుధీర్ తనకు నచ్చలేదని మొహమ్మీదే చెప్పేసింది. [ఆ అమ్మాయి అలా చెప్పడానికి కారణం తను మనసిచ్చిన ప్రియుడు ఇంకొక డున్నాడు. పెళ్ళంటూ చేసుకుంటే తన ప్రియుణ్ణే చేసుకుంటానని పట్టుబడితే ఆ అమ్మాయి తల్లితండ్రులకు ఆ సంబంధం ఇష్టం లేక మరో సంబంధం చూడ్డం మొదలుపెట్టారు. అది వేరే విషయం.]

సుధీర్‌కు అహం దెబ్బతింది. ప్రతీకారంగా పదహారు పెళ్ళిచూపులకు అటెండ్ అయ్యి, సంబంధాలు ఎంత బాగున్నప్పటికీ "నచ్చలేదు" అని నిండుగా పలికి తెగ సంతోషపడ్డాడు. చివరగా పెళ్ళిచూపులకు విసిగి విసిగి - పెళ్ళిచూపులు లేకుండానే సునందను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు.

సుధీర్, పెళ్ళిచూపులకు అటెండ్ అయ్యి - 'నచ్చలేదు' అని వదలిపెట్టిన పదిహేడు సంబంధాల్లో పదిమంది పెళ్ళిళ్ళు చేసుకుని హైదరాబాదులో ఉంటున్నారు. వాళ్ళను గమనించిన సుధీర్‌కు 'వాళ్ళను చూడగానే నే నొదలిపెట్టిన చవటలు, నేను ఏరిపారేసిన గొంగళిపురుగులు' అన్న భావం కలుగుతోంది. పైగా వాళ్ళ కుటుంబ ఆర్థిక పరిస్థితులు తనకంటే వంద రెట్లు తక్కువ స్థాయిలో ఉండడంవల్ల మరింత గర్వం కలిగింది. ఆ పదిమందిలో అయిదుగురి భర్తలు తను పని చేసే ఆఫీసులో లోయర్‌గ్రేడ్ ఉద్యోగస్థులుగా ఉన్నారు. 'నేను ఏరి పారేసిన ఆడవాళ్ళతోనే మీరు కాపురం చేస్తున్నారు' అన్న హీనభావంతో వాళ్ళను చూసి మాటిమాటికీ కాల రెగరేయడం సుధీర్‌కు బాగా అలవాటైపోయింది.

సుధీర్ ఆలోచనాసరళి సక్రమమైనదా, కాదా అన్నది ముఖ్యం కాదు కానీ - ఒకరకమైన సుపీరియర్ కాంప్లెక్స్‌తో హుషారుగా ఉండడమే కాకుండా బాగా ఒళ్ళు కూడా చేస్తున్నాడు.

** ** **

సాయంకాలం ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన సుధీర్ స్కూటర్‌కు స్టాండు వేసి ఇంట్లోకి వెళ్ళాడు. స్కూటర్ ఆగిన శబ్దం వినపడగానే వాకిట్లోకి ఎదురొచ్చే సునంద ఆ రోజు రాకపోవడంతో - స్నేహితురాళ్ళకు పోయిన వారం కొన్న నెక్లెస్‌ను, నిన్న కొన్న పట్టుచీరను చూపిస్తుండవచ్చు అనుకున్నాడు. తన దర్జా, తన హోదా ఏమిటో పదిమంది తెలుసుకోవాలనే వ్యసనం సుధీర్‌కు బాగా ఉంది. అందుకే సునంద తన స్నేహితురాళ్ళకు ఇంట్లోని ఫర్నీచర్ చూపిస్తుంటే సుధీర్ గుండె నిండా తృప్తిగా శ్వాస పీల్చుకుంటాడు. "మాకూ ఉన్నారు మొగుళ్ళు !" అని తమ భర్తలను తప్పక విసుక్కుంటారని సుధీర్ అభిప్రాయం. అలా విసుక్కోవడంవల్లా మరి కొందరు ఆడవాళ్ళు తనపై అభిమానం లాంటిది పెంచుకుంటున్నట్టు, వాళ్ళను తిరస్కరిస్తున్నట్టు అనుభూతి పొంది సుధీర్ కాలర్ ఎగరేసుకుంటుంటాడు.

సుధీర్, ఇంట్లోకి వెళ్ళి - డ్రాయింగ్ రూం వైపు చూశాడు. తను అనుకున్నట్టుగానే చీరలను చూపిస్తోంది సునంద. కానీ స్నేహితురాళ్ళకు కాదు. ఎదురింట్లోని పార్వతికి. పార్వతి ఎవరో కాదు. తను పని చేస్తున్న ఆఫీసులో బంట్రోతు ఉద్యోగం చేస్తున్న వెంకట్రావు భార్య. బంట్రోతు భార్యలతో స్నేహం కలుపుకుంటున్న సునందపైన సుధీర్‌కు చెప్పలేని ఆగ్రహం కలిగింది.

"సునందా !" గట్టిగా కేకేశాడు.

ఆ కేకకు పార్వతి బయటికి వెళ్ళిపోయింది.

సునంద మాత్రం తాపీగా వచ్చి "ఏమిటి? అలా పిలిచారు?" అని అడిగింది.

"పార్వ తెవరో తెలుసా?" అడిగాడు కోపంగానే !

"మీ ఆఫీసులో పని చేసే బంట్రోతు వెంకట్రావు భార్య అని తెలుసులేండి. కానీ మన వైభోగాల గూర్చి పార్వతి తన భర్తకు చెబితే - వెంకట్రావు ఎంత కుమిలిపోతాడో నాకు తెలుసు. అందుకే పార్వతికి..."

"ఏమిటీ?" అర్థం కాక అడిగాడు సుధీర్.

"ఆ వెధవ, అడిగినంత కట్నం మేం ఇవ్వలేదని నా సంబంధాన్ని కాదన్నాడు."

"నీకు పెళ్ళిచూపులు జరిగాయా?" ఆత్రతగా అడిగాడు.

"ఇరవై రెండు పెళ్ళిచూపులు జరిగాయి. కానీ వాళ్ళు అడిగినంత కట్నం ఇవ్వనందుకు..."

సుధీర్‌కు తలమీద పిడుగు పడ్డట్టయ్యింది. 'ఇరవై రెండుమంది తిరస్కరించిన ఆడదానితోనా నేను కాపురం చేస్తున్నది? ముఖ్యంగా బంట్రోతు వెంకట్రావు ఏరి పారేసిన దానితోనా నేను కాపురం చేస్తున్నది?'

సుధీర్‌కు తనపైన తనకే అసహ్యం కలిగింది. ఇన్నాళ్ళూ తాను ఏదో ఘనకార్యం సాధించినట్టు విర్రవీగాడు. కానీ బంట్రోతు వెంకట్రావు 'నేను ఏరిపారేసిన దానితో మా బాస్ కాపురం చేస్తున్నాడు' అని రోజూ ఎదురింట్లో అనుకుంటున్నట్టు ఊహించేసరికి తనకు తల తీసేసినట్టయింది. కళ్ళు చీకట్లు కమ్మడం మొదలుపెట్టాయి. సునంద గొంగళిపురుగు కన్నా హీనంగా అగుపించడం మొదలుపెట్టింది. ★

## న్యాయదర్శనం

### స్కూటర్ ప్రమాదానికి యజమాని బాధ్యత

కేరళకు చెందిన ఆనందానికి స్కూటరు ఉంది. దాన్ని రిపేరు కోసం వర్క్‌షాపులో ఇచ్చాడు. రిపేరు అయిన తరువాత టెస్టు కోసం మెకానిక్ బయటికి తీసుకుపోయాడు. దారిన పోయే గోమతి అనే ఆమెకు డాష్ ఇచ్చాడు. ఆమెకు దెబ్బలు తగిలాయి. కాలు విరిగింది. హాస్పిటల్‌లో చేరింది.

ఆ తరువాత ఆమె మెకానిక్ మీద, యజమాని అయిన ఆనందన్ మీద నష్ట పరిహారం కోసం ట్రిబ్యునల్‌లో కేసు వేసింది. మెకానిక్ అజాగ్రత్తగా నడపడం వలన ప్రమాదం జరిగిందని చెప్తూ ట్రిబ్యునల్ ఆరు వేలు రూపాయల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

దాని మీద యజమాని హైకోర్టుకు వెళ్ళాడు.

స్కూటరు నాదే - కాని రిపేరు కోసం వర్క్‌షాపులో ఇచ్చాను. మెకానిక్ చేసిన ప్రమాదానికి నాకు సంబంధం లేదు- అని అతని వాదన.

రిపేరుకు ఇచ్చినప్పుడు - మెకానిక్కుకు టెస్టు డ్రయివు కొరకు అనుమతి ఇచ్చినట్లేనని - అలాంటప్పుడు టెస్టు డ్రయివుతో ప్రమాదం జరిగితే అది యజమాని దాని మీద ఉన్నప్పుడు ప్రమాదం జరిగినట్లేనని చెబుతూ యజమాని వేసిన అప్పీలును కొట్టివేసింది కేరళ హైకోర్టు..

\- ఎమ్.ఎస్.శర్మ